క్లుప్తంగా...

కొల్తూర్ గ్రామ ఉపసర్పంచ్‌గా లావణ్య

శామీర్‌పేట్: మూడు చింతలపల్లి మండలం కొల్తూర్ గ్రామ ఉపసర్పంచ్‌గా లావణ్య ఎన్నికయ్యారు. గ్రామ పంచాయతీ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ఎన్నికలో లావణ్య ఉప సర్పంచ్‌గా గెలుపొందారు. తాజా మాజీ ఉపసర్పంచ్ జైపాల్‌రెడ్డిపై పాలకవర్గం అవిశ్వాసం పెట్టడంతో ఎంపీడీఓ రవినాయక్, డిప్యూటీ తహసీల్దార్ రాజిరెడ్డి సోమవారం ఎన్నికలు నిర్వహించగా 12 మంది వార్డు సభ్యులు సమావేశానికి హాజరు కాగా ఏడుగురు వార్డు సభ్యులు లావణ్యకు మద్దతు పలకడంతో అధికారులు ఆమె ఉపసర్పంచ్‌గా ఎన్నికైనట్లు ప్రకటించారు.

దరఖాస్తుల ఆహ్వానం

మేడ్చల్: ఎస్సీ కార్పొరేషన్ ద్వారా అందజేస్తున్న రుణాల కోసం మండల దళిత యువత దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీఓ పద్మావతి కోరారు. డైరీ ఫాం, గొర్రెల పెంపకం యూనిట్ల కోసం అర్హులైన వారు ఎంపీడీఓ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. ఆధార్ కార్డు, పది గుంటల భూమి పాస్ పుస్తకం, ఆదాయం, కుల ధృవీకరణ పత్రాలు, రేషన్ కార్డు, బ్యాంకు ఖాతా బుక్, రెండు పాస్‌ఫొటో సైజ్ ఫొటోలతో దరఖాస్తు చేసుకోవాలని ఆమె కోరారు.

వడ్డెర సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా వెంకటేశ్

ఘట్‌కేసర్: తెలంగాణ వడ్డెర సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా మర్పల్లిగూడకు చెందిన శివరాత్రి వెంకటేశ్ వడ్డెర ఎన్నికయ్యాడు. ఈ మేరకు వడ్డెర సంఘం రాష్ట్ర అధ్యక్షుడు అయిలమల్లు ఆయనకు నియామక పత్రం అందజేశారు. వెంకటేశ్ మాట్లాడుతూ.. వడ్డెర విద్యార్థుల అభివృద్ధి, వడ్డెరలను ఎస్టీల్లో చేర్పింపించేందుకు కృషి చేస్తానన్నారు.

ప్రజావాణిలో వినతుల వెల్లువ

సాక్షి,మేడ్చల్ జిల్లా: ప్రజావాణిలో ప్రజల నుంచి వచ్చే వినతులు, ఆర్జీలకు సంబంధించిన సమస్యలు వెను వెంటనే పరిష్కరించేలా సంబంధిత అధికారులు అవసరమైన చర్యలు తీసుకోవాలని మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా అదనపు కలెక్టర్ నర్సింహారెడ్డి అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణిలో జిల్లా రెవెన్యూ అధికారి లింగ్యానాయక్‌తో కలిసి 65 ఆర్జీలను స్వీకరించారు. కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం

మేడ్చల్: గౌడవెల్లి గ్రామంలో మైసమ్మ ఆలయం వరకు నిర్మిస్తున్న సీసీ రోడ్డు పనులను జెడ్పీ కాంగ్రెస్ ఫ్లోర్ లీడర్ హరివర్ధన్‌రెడ్డి, గ్రామ సర్పంచ్ సురేందర్‌ముదిరాజ్‌తో కలిసి ప్రారంభించారు. గ్రామ పరిధిలోని ఐకాన్ మెడోస్ ఎన్‌క్లేవ్, విశిష్ట ఇన్‌ఫ్రా వారి సహకారంతో రూ.50లక్షలతో రోడ్డును నిర్మిస్తున్నట్లు సర్పంచ్ సురేందర్ ముదిరాజ్ తెలిపారు. కార్యక్రమంలో నాయకులు, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

పైప్‌లైన్ పనులు ప్రారంభం

పోచారం: అన్నోజిగూడలోని 11వ వార్డులో శివసాయి గణేష్ ఎన్‌క్లేవ్ వద్ద జలమండలి చేపట్టిన తాగునీటి పైప్‌లైన్ పనులను చైర్మన్ బోయపల్లి కొండల్‌రెడ్డి సోమవారం ప్రారంభించారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ రెడ్యానాయక్, కమిషనర్ సురేష్, కౌన్సిలర్లు నల్లవెల్లి లక్ష్మి శేఖర్, చింతల రాజశేఖర్, జలమండలి అధికారులు, కాలనీవాసులు పాల్గొన్నారు.


రక్తదానం చేయండి

ఘట్‌కేసర్: రక్తదానం మహా దానమని, ప్రతి ఒక్కరూ విరివిగా రక్తదానం చేయాలని చైర్‌పర్సన్ పావనీయాదవ్ అన్నారు. మున్సిపల్ ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో పట్టణంలోని శ్రీవాసవీ కన్యకా పరమేశ్వరీ ఫంక్షన్ హాల్‌లో వైస్ చైర్మన్ మాధవరెడ్డి, కమిషనర్ వేమనరెడ్డితో కలసి సోమవారం రక్తదాన శిబిరం నిర్వహించారు. కార్యక్రమంలో జంగయ్యయాదవ్, ఆర్యవైశ్య సంఘం సభ్యులు నవిత మమత, రమ్య, శ్రావణి, మేఘమాల, నవనీత పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేత

ఘట్‌కేసర్: అనారోగ్యంతో ఆస్పత్రిలో చికిత్స పొందిన వ్యక్తికి మంత్రి మల్లారెడ్డి సోమవారం సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు అందజేశారు. మున్సిపాలిటీలోని బొక్కొనిగూడకు చెందిన కట్ట లక్ష్మారెడ్డికి రూ.35వేలు ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి మంజూరు కాగా బాధితుడి కుమారుడికి చెక్కు అందజేశారు. విష్ణువర్ధన్‌రెడ్డి, మధుసూదన్‌రెడ్డి, కట్ట మధుసూదన్‌రెడ్డి పాల్గొన్నారు.


విద్యతోనే సమాజంలో మార్పు



ఎంపీపీఎస్ ప్రారంభోత్సవంలో అధికారులు, సంస్థ ప్రతినిధులు

జవహర్‌నగర్: విద్యతోనే సమాజంలో మార్పు వస్తోందని అసిస్టెంట్ సెక్టోరల్ ఆఫీసర్ (ఏఎస్‌ఓ) అయ్యన్న అన్నారు. సోమవారం జవహర్‌నగర్ కార్పొరేషన్ పరిధిలోని గబ్బిలాలపేటలో తాత్కాలిక మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల(ఎంపీపీఎస్‌ల)ను ప్రారంభించారు. ఎంఈఓ శశిధర్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ధనలక్ష్మి, దేవేందర్‌నగర్ పాఠశాల హెచ్‌ఎం లక్ష్మి, క్రై సంస్థ ఫెలోస్ హిమబిందు, మంజుల, సునీల్, అంగన్‌వాడీ టీచర్లు, బస్తీవాసులు పద్మ, శకుంతల, మౌనిక, సుజాత, స్వప్న, రేణుక పాల్గొన్నారు.

గడప దాటకుండా.. గాలం!



అవిశ్వాసం వేయకుండా.. చాకచక్యంతో పలువురు కౌన్సిలర్ల మళ్లింపు

మేడ్చల్ మున్సిపాలిటీ చైర్ పర్సన్ సీటు సేఫ్

విభజించు.. పాలించు.. మంత్రాన్ని అనుసరిస్తున్న మంత్రి



అసమ్మతి కౌన్సిలర్లు కలెక్టరేట్ గేటు తాకకుండా వ్యూహంతో అడ్డుకున్న మంత్రి మల్లారెడ్డి

మేడ్చల్: జిల్లాలో జవహర్‌నగర్, పీర్జాదిగూడ కార్పొరేషన్లలో బీఆర్‌ఎస్ అసమ్మతి రేగి అబాసుపాలైన మంత్రి మల్లారెడ్డి మేడ్చల్‌లో మున్సిపాలిటీలో అవమాన పాలు కాకుండా చాకచక్యంగా రాజకీయం నడిపిస్తున్నాడు. మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలో అన్ని మున్సిపాలిటీల కంటే ముందుగానే అధికార బీఆర్‌ఎస్‌కు చెందిన 19 మంది కౌన్సిలర్లలో 16 మంది కౌన్సిలర్లు అసమ్మతి బాట పట్టి చైర్‌పర్సన్‌ను కుర్చీపై నుంచి దించాలని బాహాటంగానే నిరసనలు, ధర్నాలు, ఫిర్యాదులు చేసినా మంత్రి ఖాతరు చేయలేదు.

✧ మంత్రి చాకచక్యంగా వ్యవహరించి..

జవహర్‌నగర్ కార్పొరేటర్లు మంత్రి మాటను ఖాతరు చేయకుండా అసమ్మతి నోటీసు ఇవ్వడం, పీర్జాదిగూడలో మేయర్‌పై కత్తులు నూరుతుండటంతో మంత్రి ఒక్కసారిగా అలర్ట్ అయ్యారు. అక్కడ పోయిన పరువును మేడ్చల్‌లో పోకుండా జాగ్రత్త పడుతూ కౌన్సిలర్ల బలహీనతలను ఆసరా చేసుకుని చాలా చాకచక్యంగా వ్యవహరించి అవిశ్వాసంను ఆపాడు.

✧ నోటీసు ఇవ్వకుండా అడ్డుకట్ట..

మేడ్చల్ మున్సిపల్ చైర్‌పర్సన్ దీపికా నర్సింహారెడ్డిని పదవి నుంచి దించాలని రెండు నెలలుగా పోరాటం చేస్తున్న 16 మంది బీఆర్‌ఎస్ కౌన్సిలర్లు ఈ నెల 30వ తేదీ వరకు గడువు నిర్ణయించి మంత్రికి తాము కావాలో.. చైర్‌పర్సన్ కావాలో.. తేల్చుకోవాలని సవాల్ చేశారు. గడువు ముగియడం, మంత్రి పంపిన దూతలు చేసిన రాయబారం సఫలం కాకపోవడంతో అసమ్మతి కౌన్సిలర్ల 15 మంది కౌన్సిలర్ల సంతకాలతో అవిశ్వాసం నోటీసు సోమవారం సిద్ధం చేశారు. కలెక్టర్ కార్యాలయంలో మధ్యాహ్నం ఇవ్వాలని వారంతా నిర్ణయించుకోగా మంత్రి తన చాతుర్యంతో నాయానో.. భయానో.. చెప్పి కౌన్సిలర్లు కలెక్టరేట్ గడప తొక్కకుండా వారిని నిలిపి వేయించారు.

✧ విభజించు.. పాలించు.. మంత్రంతో..

మేడ్చల్ మున్సిపల్ రాజకీయం తారా స్థాయికి చేరడంతో మంత్రి మల్లారెడ్డి ఒక్కసారిగా అలర్ట్ అయ్యారు. రెండు నెలలుగా విషయాన్ని తేలికగా తీసుకున్న ఆయన సోమవారం తన రాజకీయ చతురతతో తన అనుచరులపై ప్రదర్శించారు. 16 మంది కౌన్సిలర్లు అసమ్మతి గ్రూపులో ఉండటంతో వారిని విభజించి సఫలమయ్యాడు. 16 మందిలో 5 మంది కౌన్సిలర్లను తన మాట వినేలా మార్చారు.

✧ ఫోన్‌లో మాట్లాడి మార్చేసిన మంత్రి..

ఆది, సోమవారం మంత్రి మల్లారెడ్డి నేరుగా కౌన్సిలర్లతో ఫోన్‌లో మాట్లాడి తన వైపు ఉంటే ఏ పనులైనా చేస్తానని, ఏం కావాలంటే అది చేసి పెడతానని, తనను కాదని అవిశ్వాసం నోటీసులు ఇస్తే అది ఎలా నెగ్గుతారో చూస్తానని, తనను కాదని యంత్రాంగం పని చేయదని, ఇలా తన వద్ద ఉన్న అన్ని అస్త్రాలను ఉపయోగించడంతో అసమ్మతి గ్రూపు నుంచి 5 మంది తప్పుకుని తటస్థంగా ఉండిపోయారు. కలెక్టర్ కార్యాయలంకు వెళ్లకుండా ఉండటంతో అవిశ్వాసం నోటీసులు ఇవ్వకుండా మంత్రి అడ్డుకోగలిగారు. మేడ్చల్ బీఆర్‌ఎస్ మున్సిపల్ రాజకీయం రోజుకో మలుపు తిరుగుతూ థ్రిల్లర్ సినిమాను తలపిస్తోంది.

‘ఎన్ని అడ్డంకులు వచ్చినా లక్ష్యాన్ని మరవద్దు’

- రానున్న రోజుల్లో ఇండియా బాగా అభివృద్ధి చెందుతుంది
- ప్రపంచ ప్రఖ్యాత మోటివేషనల్ స్పీకర్ నిక్ వుజిసిక్
- మల్లారెడ్డి యూనివర్సిటీలో మోటివేషనల్ వర్క్‌షాప్



నిక్ వుజిసిక్ సన్మానిస్తున్న మంత్రి మల్లారెడ్డి, యూనివర్సిటీ వీసీ

మేడ్చల్‌రూరల్: తమకు ఎన్ని అడ్డంకులు వచ్చినా విద్యార్థులు తమ కలలు, లక్ష్యాల సాకారానికి నిరంతరం పాటు పడాలని ప్రపంచ ప్రఖ్యాత మోటివేషనల్ స్పీకర్ నిక్ వుజిసిక్ అన్నారు. గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధి మైసమ్మగూడలోని మల్లారెడ్డి యూనివర్సిటీలో నిర్వహిస్తున్న మోటివేషనల్ వర్క్‌షాప్‌ను ఆయన ప్రారంభించి ప్రసంగించారు. ఈ సందర్భంగా నిక్ వుజిసిక్ మాట్లాడుతూ.. విద్యార్థులు తమ ఎదుగుదలకు అవసరమయ్యే ఆలోచన ధోరణిని అలవర్చుకోవాలన్నారు. అపజయాలు అందరికి ఎదురవుతాయన్న ఆయన వాటిని ఎలా ఎదుర్కోవాలో వివరించారు. భవిష్యత్ తరాల వ్యాపారవేత్తలు, ఇంజినీర్లుగా భారతదేశంలో నూతన ఒరవడి తీసుకువచ్చి ఆర్థిక ప్రగతికి తోడ్పడాలన్నారు. రానున్న రోజుల్లో ఇండియా బాగా అభివృద్ధి చెందుతుందన్నారు. ఈ సందర్భంగా మంత్రి మల్లారెడ్డిని నిక్ వుజిసిక్ ప్రశంసించారు. తన ప్రసంగంతో నూతన ఉత్తేజాన్ని నింపిన నిక్ వుజిసిక్‌కు విద్యార్థులు తమ మొబైల్‌ఫోన్ టార్చ్‌లైట్లతో ధన్యవాదాలు తెలిపారు. అంతకుముందు తొలిసారి హైదరాబాద్ నగరానికి, మల్లారెడ్డి యూనివర్సిటీకి విచ్చేసిన నిక్ వుజిసిక్‌ను యూనివర్సిటీ వీసీ వీఎస్‌కే రెడ్డితో తదితరులతో కలిసి మంత్రి మల్లారెడ్డి సన్మానించారు. ఈ కార్యక్రమంలో కళాశాల సెక్రెటరీ మహేందర్‌రెడ్డి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ కళ్లను కాపాడుకోవాలి



శిబిరంను పర్యవేక్షిస్తున్న కమిషనర్ వేమనరెడ్డి, చైర్‌పర్సన్ పావనీయాదవ్



కూపన్లు అందజేస్తున్న కౌన్సిలర్ సరస్వతిరెడ్డి

ఘట్‌కేసర్: ప్రతి ఒక్కరూ కళ్లను సంరక్షించుకోవాలని చైర్‌పర్సన్ పావనీయాదవ్ అన్నారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన రెండో విడత కంటి వెలుగును ఎన్‌ఎఫ్‌సీనగర్‌లో స్థానిక కౌన్సిలర్ సంగీత ప్రభాకర్‌రెడ్డితో కలిసి కమిషనర్ వేమనరెడ్డి సోమవారం పరిశీలించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ వెంకటేశ్‌ముదిరాజ్, మాజీ వార్డు సభ్యుడు జంగారెడ్డి, ఎఫ్‌ఎస్‌సీఎస్ మాజీ డైరెక్టర్ ప్రభాకర్ రెడ్డి, జంగయ్యయాదవ్, సుధాకర్‌రెడ్డి, చెన్నరెడ్డి, ఫణీందర్‌రెడ్డి, రామచంద్రారెడ్డి, పీహెచ్‌ఎన్ విమల రెడ్డి, కంటి నిపుణులు శిరిష, డీఈఓ సాత్విక్, అంగన్‌వాడీ టీచర్ సుచిత్ర, ఆశ వర్కర్లు లక్ష్మి, మేఘమాల పాల్గొన్నారు.

గుండ్లపోచంపల్లిలో కంటి వెలుగు ప్రారంభం

మేడ్చల్: గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధిలోని 4వ వార్డులో కంటి వెలుగు కార్యక్రమాన్ని కౌన్సిలర్ అమరం సరస్వతిమోహన్‌రెడ్డి ప్రారంభించారు. వార్డు ప్రజలు శిబిరానికి హాజరై కంటి పరీక్షలు చేయించుకుని అవసరమైన వారు కంటి అద్దాలను పొందాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ బీజేపీ నాయకులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఎల్ఎన్ కాలనీలో కంటి వెలుగు శిబిరం

పోచారం: అన్నోజిగూడలోని ఎల్ఎన్ కాలనీ అంగన్వాడీ కేంద్రంలో కంటి వెలుగు శిబిరాన్ని వైస్ చైర్మన్ నానావత్ రెడ్యానాయక్‌తో కలిసి చైర్మన్ బోయపల్లి కొండల్‌రెడ్డి సోమవారం ప్రారంభించారు. కార్యక్రమంలో కమిషనర్ సురేష్, కౌన్సిలర్లు చింతల రాజశేఖర్, నల్లవెల్లి లక్ష్మి, కంటి వైద్య నిపుణుడు శ్రీనివాసులు, బీఆర్‌ఎస్ నాయకులు నల్లవెల్లి శేఖర్, లక్ష్మణ్ యాదవ్, సంతోష్ నాయక్, తిలక్, కార్తీక్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

‘బ్రహ్మోత్సవాల్లో భక్తులకు అసౌకర్యం కలగనీయొద్దు’



జాతర ఏర్పాట్లను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ అభిషేక్ అగస్త్య

కీసర: కీసరగుట్ట మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల సందర్భంగా కీసరగుట్టకు తరలివచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా తగు చర్యలు తీసుకుంటామని మేడ్చల్–మల్కాజ్‌గిరి జిల్లా అదనపు కలెక్టర్ అభిషేక్ అగస్త్య అన్నారు. సోమవారం కీసరగుట్టలో ఫిబ్రవరి 16 నుంచి ఆరు రోజుల పాటు జరిగే మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల సందర్భంగా చేయనున్న ఏర్పాట్లను పరిశీలించారు. కీసరగుట్టపై గురుకుల పాఠశాల పరిసరాల్లో ఏర్పాటు చేయనున్న వాహనాల పార్కింగ్, కీసరవాణీ వద్ద ఎగ్జిబిషన్ స్థలాన్ని సందర్శించారు. గుట్టపైకి వచ్చే మార్గంలో వై జంక్షన్ మలుపులో రోడ్డును వెడల్పు చేయాలని అదనపు కలెక్టర్ దృష్టికి కీసర సర్పంచ్ మాధురివెంకటేష్ తీసుకువచ్చారు. కీసర నుంచి గుట్టపై వరకు స్తంభాలకు విద్యుద్దీపాలు ఏర్పాటు చేసేందుకు థర్డ్‌వైర్ ఏర్పాటు చేయాలని కోరారు. కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్మన్ బెస్త వెంకటేష్, ఎంపీపీ మల్లారపు ఇందిరాలక్ష్మీనారాయణ, ఎంపీడీఓ రమాదేవి, ఎంపీఓ మంగతాయారు, గ్రామ కార్యదర్శి సురేష్‌రెడ్డి, ఆర్యవైశ్య నిత్యాన్నదాన సత్రం అధ్యక్షుడు బెలిదె రమేష్‌గుప్తా, జెడ్పీ ఏఈ జగపతి పాల్గొన్నారు.

ప్రతి పేద కుటుంబానికి మల్లారెడ్డి ట్రస్ట్ చేయూత



మృతుల కుటుంబాలకు ఆర్థిక సాయం ఇస్తున్న దృశ్యం




ఆర్థిక సాయం అందజేస్తున్న సర్పంచ్ రమాదేవి, లింగంయాయాదవ్

కీసర: ప్రతి పేద కుటుంబానికి మంత్రి మల్లారెడ్డి అండగా ఉంటాడని బీఆర్‌ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు జాలాల్‌పురం సుధాకర్‌రెడ్డి, కీసర సర్పంచ్ నాయకపు మాధురి వెంకటేష్‌లు అన్నారు. సోమవారం కీసర గ్రామంలో ఇటీవల అనారోగ్యంతో మృతిచెందిన తంగళ్లపల్లి పోచయ్య, సింగిరెడ్డి బాల్‌రెడ్డి, ఎస్.రాజేశ్వరి, కుక్కదువు రాములు, పుంద్రు రాధిక, సూరిబాబుల కుటుంబాలకు మల్లారెడ్డి ట్రస్టు ద్వారా ఒక్కో రూ.5 వేల చొప్పున రూ.30 వేల ఆర్థిక సాయంను అందజేశారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ తటాకం లక్ష్మన్, మాజీ ఎంపీపీ రామారం సుజాత, నాయకులు గోరంటి ప్రవీన్, చినింగని బాల్‌రాజ్, సుమన్‌బన్ని, వెంకట్, చెట్టి మధు తదితరులు పాల్గొన్నారు.

చౌదరిగూడ వెంకటాద్రి టౌన్‌షిప్‌లో ..

ఘట్‌కేసర్: చౌదరిగూడ వెంకటాద్రి టౌన్‌షిప్‌లో ఇటీవల మరణించిన వసంత్‌కుమార్, మక్త గ్రామంలో యాదగిరి, సాదల్ అలీగూడలో జిలక్ బేగం కుటుంబాలకు చామకూర మల్లారెడ్డి సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆర్థిక సాయం అందజేశారు. సర్పంచ్ రమాదేవి, ఆ గ్రామ బీఆర్‌ఎస్ అధ్యక్షుడు లింగం యాదవ్ సోమవారం మృతుల నివాసాలకు వెళ్లి ఒక్కో కుటుంబానికి రూ.5 వేల చొప్పున రూ.15 వేలు అందజేశారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ మహేందర్‌గౌడ్, వార్డు సభ్యులు స్వామిదాస్, లక్ష్మణ్‌గౌడ్, నాయకులు వేగానంద్‌గౌడ్, వినోద్‌గౌడ్, వినయ్‌కుమార్, ట్రస్ట్ సభ్యుడు వేణు పాల్గొన్నారు.

తైక్వాండోలో ‘నాగారం టైగర్స్ కబ్స్’ విద్యార్థుల సత్తా



సత్తాచాటిన విద్యార్థులను అభినందిస్తున్న చైర్మన్ చంద్రారెడ్డి

కీసర: తెలంగాణ రాష్ట్ర తైక్వాండో అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 28, 29వ తేదీల్లో ఘట్‌కేసర్‌లో నిర్వహించిన తైక్వాండో పోటీల్లో నాగారంకు చెందిన టైగర్స్ కబ్స్ తైక్వాండో అకాడమీకి చెందిన బాలబాలికలు పాల్గొన్ని సత్తాచాటారు. పోటీల్లో 31 జిల్లాలకు చెందిన బాలబాలికలు పోటీల్లో పాల్గొనగా నాగారం టైగర్స్‌కబ్స్ తైక్వాండో అకాడమీకి చెందిన 36 మంది బాలబాలికల్లో 28 మంది బంగారు, వెండి, రజిత పతకాలు సాధించినట్లు అకాడమీ చైర్మన్, ట్రెనర్ జి.శివకుమార్ తెలిపారు. ఈ మేరకు సోమవారం నాగారం మున్సిపల్ చైర్మన్ కొకుట్ల చంద్రారెడ్డి సత్తాచాటిన విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో కౌన్సిలర్ లావణ్యశ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

మర్యాదపూర్వక కలయిక



ఘట్‌కేసర్: బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, కరీంనగర్ పార్లమెంటు సభ్యుడు బండి సంజయ్‌కుమార్‌ను ఆ పార్టీ మేడ్చల్ రూరల్ జిల్లా అధ్యక్షుడు విక్రంరెడ్డి, మండలాధ్యక్షుడు చలువాదీ ప్రవీణ్‌రావు ఆధ్వర్యంలో ఆయన నివాసంలో సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఘట్‌కేసర్ మండలంలోని ప్రతాపసింగారంలో నిర్వహించ తలపెట్టిన బహిరంగ సభ, బీజేపీలోకి చేరికలపై ఆయనతో చర్చించారు. ప్రతాపసింగారం వార్డు సభ్యుడు మురళీకృష్ణ, బాల్‌రాజ్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

కుష్ఠు వ్యాధి నిర్మూలనపై అవగాహన

మేడ్చల్‌రూరల్: మండలంలోని శ్రీరంగవరం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో కుష్ఠు వ్యాధి నిర్మూలనపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. పీహెచ్‌సీ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో మేడ్చల్ జెడ్పీటీసీ శైలజ విజయానంద్‌రెడ్డి, వైద్యులు పాల్గొని విద్యార్థులకు కుష్ఠు వ్యాధి లక్షణాలు, నిర్మూలన గురించి వివరించారు. వైద్యులు ప్రతిభ, మహేల, గ్రామ ఉపసర్పంచ్, ఎంపీటీసీ ప్రకాశ్, పాఠశాల హెచ్‌ఎం విజయ్, వైద్య సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్..

బొలెరో వాహనం బోల్తా

కీసర: కీసర ఓఆర్‌ఆర్‌పై సోమవారం తెల్లవారుజామున ద్రాక్షపండ్లు తరలిస్తున్న బొలెరో వాహనం బోల్తా కొట్టింది. వివరాల్లోకి వెళ్లితే.. మహారాష్ట్ర నుంచి కొత్తపేట పండ్ల మార్కెట్‌కు ద్రాక్షపండ్లను తరలిస్తున్న బొలెరో వాహనం(ఎంహెచ్13డీ ఓ4765) డ్రైవర్ అనిల్ సోమవారం తెల్లవారుజామున కీసర ఓఆర్‌ఆర్ సమీపంలోకి రాగానే నిద్రలోకి జారుకోవడంతో వాహనం ఒక్కసారిగా అదుపుతప్పి ఓఆర్‌ఆర్ డివైడర్‌ను ఢీకొట్టింది. ఈ ఘటనలో వాహనంలోని ద్రాక్షపండ్లు రోడ్డుమీద కుప్పలు తెప్పలుగా పడిపోగా డ్రైవర్ అనిల్‌కు స్వల్ప గాయాలయ్యాయి. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని గాయపడిన డ్రైవర్‌ను చికిత్స నిమిత్తం 108లో ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఉరి వేసుకుని వ్యక్తి ఆత్మహత్య

ఘట్‌కేసర్: ఉరి వేసుకుని ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన ఘట్‌కేసర్ పీఎస్ పరిధిలో చోటు చేసుకుంది. సీఐ అశోక్‌రెడ్డి వివరాల ప్రకారం... యంనంపేట్‌కు చెందిన ఆటో డ్రైవర్ మహేశ్‌రెడ్డి(40) ఘట్‌కేసర్‌లో కుటుంబ సభ్యులతో కలిసి నివాసం ఉంటున్నాడు. ఇంటి పంపకం విషయంలో తల్లి స్వరూప, సోదరుడు శేఖరెడ్డితో తగాదా జరుగుతోంది. ఇంటిని ఖాళీ చేయాలని మహేశ్‌రెడ్డిని కొంతకాలంగా వేధిస్తున్నారు. కాగా మహేశ్‌రెడ్డి భార్య, కుమారుడు, అత్త కలిసి ఆదివారం యాదాద్రికి వెళ్లి దర్శనం అనంతరం సాయంత్రానికి తిరిగి వచ్చారు. అదే సయమంలో మహేశ్‌రెడ్డి విధులు ముగించుకొని ఇంటికొచ్చి బెడ్‌రూంలో నిద్రకు ఉపక్రమించాడు. ఈ క్రమంలో మహేశ్‌రెడ్డి భార్య రజనీ వంట చేయడంలో నిమగ్నమైంది. వంట చేసి బెడ్‌రూంలోకి వెళ్లగా మహేశ్‌రెడ్డి చీరతో ఫ్యాన్‌కు ఉరి వేసుకొన్నాడు. వెంటనే ఆమె భయంలో కేకలు వేయగా స్థానికులు వచ్చి మృతదేహాన్ని కిందకు దించారు. అత్త, బావ వేధింపులతోనే తన భర్త మహేశ్‌రెడ్డి ఆత్మహత్య చేసుకున్నట్లు పీఎస్‌లో ఆమె ఫిర్యాదు చేసింది. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

జాతిపితకు ఘన నివాళులు



మేడ్చల్: జాతి పిత మహాత్మాగాంధీజీ వర్ధంతి సందర్భంగా మండల పరిషత్ కార్యాలయంలో మేడ్చల్, గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీలు, తహసీల్దార్ కార్యాలయ సమీపంలో గాంధీ విగ్రహాలు, చిత్రపటాల వద్ద అధికారులు, నాయకులు నివాళులు అర్పించారు. గౌడవెల్లిలో పీసీసీ అధికార ప్రతినిధి హరివర్ధన్‌రెడ్డి, గ్రామ సర్పంచ్ సురేందర్ ముదిరాజ్ తదితరులు నివాళులు అర్పించారు.

నాగారం సత్యనారాయణ కాలనీలో...



కీసర: గాంధీ వర్ధంతి సందర్భంగా నాగారం మున్సిపాలిటీ సత్యనారాయణ కాలనీలో సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో గాంధీ విగ్రహానికి మున్సిపల్ చైర్మన్ కొకుట్ల చంద్రారెడ్డి పూల మాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కౌన్సిలర్ అన్నంరాజు లావణ్యశ్రీనివాస్ పాల్గొన్నారు.

ఘట్‌కేసర్ మున్సిపాలిటీ సమీపంలో...

ఘట్‌కేసర్: మహాత్మా గాంధీ వర్ధంతి సందర్భంగా సోమవారం మున్సిపాలిటీ కార్యాలయం సమీపంలోని గాంధీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో చైర్‌పర్సన్ పావనీయాదవ్, బీ–బ్లాక్ అధ్యక్షుడు మహేశ్‌గౌడ్, ఉప సర్పంచ్ పరమేశ్‌గౌడ్, చంద్రశేఖర్‌గుప్తా, ప్రమోద్‌గుప్తా, శ్రీధర్, విశ్వనాథం, శరత్, వెంకన్న, శ్రీరాములు, ప్రమోద్, శ్రవణ్, నగేశ్, సత్యనారాయణ, కృష్ణమూర్తి, వెంకట్, నరేశ్, మమత, మేఘమాల, రమ్య, నవనీత, శ్రావణి, నవిత పాల్గొన్నారు.



పశువులకు ఉచితంగా బ్రూసెల్లోసిస్ టీకాలు



పోచారం: యమ్నంపేట్‌లో పశువులకు నిర్వహించిన బ్రూసెల్లోసిస్ వ్యాధి నిరోధక టీకా శిబిరాన్ని చైర్మన్ బోయపల్లి కొండల్‌రెడ్డితో కలిసి జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారి డాక్టర్ శేఖర్ సోమవారం ప్రారంభించారు. ఈ సంర్భంగా ఆయన మాట్లాడుతూ.. 4 నుంచి 8 నెలల ఆవుదూడలకు బ్రూసెల్లోసిస్ టీకా ఇవ్వడం జరిగిందన్నారు. కార్యక్రమంలో కమిషనర్ సురేష్, ఏడీ శ్రీనాథ్, డా.పద్మిని, ఘట్‌కేసర్ మండల రైతు సమన్వయ సమితి అధ్యక్షుడు కొంతం అంజిరెడ్డి, కౌన్సిలర్ చింతల రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

కలెక్టరేట్ వద్ద ధర్నాలు..

‘గృహకల్ప ఇళ్లు ఇతరులకు కేటాయించడం దారుణం’



సాక్షి,మేడ్చల్ జిల్లా: దమ్మాయిగూడ మున్సిపాలిటీ బండ్లగూడ రాజీవ్ గృహకల్పలో ఎన్నో ఏళ్లుగా నివాసం ఉంటున్న కుటుంబాలను బయటకు వెళ్లగొట్టి వేరే ప్రాంతాల్లోని అధికార పార్టీ నాయకులకు ఆ గృహాలను కేటాయించడం దారుణని టీపీసీసీ సీనియర్ అధికార ప్రతినిధి, మేడ్చల్ నియోజకవర్గ కోఆర్డినేటర్ సింగిరెడ్డి హరివర్ధన్ రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం కలెక్టరేట్ ఎదుట కాంగ్రెస్ పార్టీ మహిళా నాయకురాలు ఈగ శ్వేత ఆధ్వర్యంలో బండ్లగూడ గృహకల్ప కుటుంబాలతో కలిసి ధర్నా చేపట్టారు. వారు మాట్లాడుతూ.. ఎన్నో ఏళ్ల నుంచి నివాసముంటున్న రాజీవ్ గృహకల్పలో నిరుపేదలకే ఆ ఇళ్లను కేటాయించాలని డిమాండ్ చేశారు. అనంతరం జిల్లా అడిషనల్ కలెక్టర్ ఏనుగు నర్సింహారెడ్డికి వినతిపత్రం ఇచ్చారు. కార్యక్రమంలో గోగుల సరిత వెంకటేష్, సామల శ్రీనివాసరెడ్డి, ఏనుగు సంజీవరెడ్డి, సుమేష్, సిరిసిల్ల శ్రీనివాస్, వైఎస్ గౌడ్, భీమిడి జైపాల్‌రెడ్డి, మేకల మహేందర్‌యాదవ్, జగన్, బిక్షపతి సాగడ రాజు, సత్యం, సాగడ రమేష్ పాల్గొన్నారు.

వేతనాల కోసం కార్మికులు...

సాక్షి,మేడ్చల్‌జిల్లా: గ్రామ పంచాయతీ కార్మికుల నాలుగు నెలలుగా చెల్లించాల్సిన జీతాలను వెంటనే అందజేయాలని డిమాండ్ చేస్తూ సోమవారం మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట సీఐటీయూ ఆధ్వర్యంలో గ్రామ పంచాయతీ కార్మికులు ధర్నా నిర్వహించారు. అనంతరం సీఐటీయూ నాయకుడు, గ్రామపంచాయతీ కార్మికుల యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్రీనివాస్ ఆధ్వర్యంలో జిల్లా అదనపు కలెక్టర్ నర్సింహారెడ్డి సమస్యలతో కూడిన మెమొరాండం అందజేశారు. ఈ ధర్నాలో సీఐటీయూ జిల్లా కోశాధికారి ఉన్ని కృష్ణ, గ్రామ పంచాయతీ వర్కర్స్ నాయకులు సుధాకర్, సుగుణ, ఎల్లయ్య, మల్లయ్య, కార్మికులు పాల్గొన్నారు.

ఎస్టీ జాబితాలో చేర్చాలని వడ్డెరలు...

సాక్షి,మేడ్చల్‌జిల్లా: వడ్డెర కులస్తులను ఎస్టీ జాబితాలో చేర్చాలని కలెక్టరేట్ ఎదుట సోమవారం రాష్ట్ర వడ్డెర సంఘం చారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షుడు శివరాత్రి అయిలు మల్లు ఆధ్వర్యంలో వడ్డెర సంఘం నేతలు ధర్నా చేపట్టారు. శివరాత్రి అయిలు మల్లు మాట్లాడుతూ.. 40 లక్షలు ఉన్నా వడ్డెర కులస్తులకు అడుగడుగునా అన్యాయం జరుగుతుందని, తక్షణమే వడ్డెరులను ఎస్టీ జాబితాలో చేర్చాలని డిమాండ్ చేశారు. అనంతరం అదనపు కలెక్టర్ నర్సింహారెడ్డికి వినతి పత్రం ఇచ్చారు. ఈ ధర్నాలో సంఘం రాష్ట్ర నాయకులు గండికోట కుమార్, రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు శివరాత్రి ఉమా, రాష్ట్ర యూత్ అధ్యక్షుడు వల్లెపు సాయికుమార్, జిల్లా అధ్యక్షుడు వెంకటేష్, నాయకులు ఇరగ దిండ్ల తిరుపతి పాల్గొన్నారు.

‘డబుల్’ ఇళ్లు ఇవ్వాలని వికలాంగులు...



సాక్షి,మేడ్చల్ జిల్లా: రాష్ట్ర బడ్జెట్‌లో వికలాంగుల సంక్షేమానికి 5 శాతం నిధులు కేటాయించాలని, ఆసరా పెన్షన్ల మంజూరుకు ఆదాయ పరిమితి విధించే జీఓ 17ను రద్దు చేయాలని, డబుల్ బెడ్రూమ్ ఇళ్లు కేటాయించాలని వికలాంగుల హక్కుల జాతీయ వేదిక తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు కె.వెంకట్ ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు సోమవారం మేడ్చల్ కలెక్టర్ కార్యాలయం ఎదుట వికలాంగులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకట్ మాట్లాడుతూ.. వికలాంగుల వివాహ ప్రోత్సాహకానికి 711 మంది దరఖాస్తు చేసుకుంటే 271 మందికే మంజూరు చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. స్వయం ఉపాధి కోసం 829 మంది దరఖాస్తు చేసుకుంటే 386 మందికే రుణాలు మంజూరు చేసారన్నారు. అనంతరం జిల్లా అదనపు కలెక్టర్ నర్సింహారెడ్డికి వినతి పత్రం అందజేశారు. ధర్నాలో వేదిక జిల్లా అధ్యక్షుడు రంగారెడ్డి, నాయకులు చంద్రమోహన్, బాలయ్య, మల్లేష్, షేక్‌బేగం, నాగరాజు, సోని, చిరంజీవి, నరసింహ ఉన్నారు.